# ఓటెత్తిన మహిళా చైతన్యం





ధర్మపురి, డిసెంబర్ 1: నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో 2,26,880 మంది ఓటర్లుండగా ఇందులో 1,11,172 మంది పురుషులు, 1,15,702 మంది మహిళలు ఓటర్లున్నారు. ఆరుగురు థర్డ్‌జెండర్లున్నారు. అయితే మూడో శాసనసభ ఎన్నికల్లో మహిళలే ఎక్కువ శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,80,451 ఓట్లు పోలవగా..ఇందులో పురుషులు 84,111, మహిళలు 96,338 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటిలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్లే మహిళల్లో చైతన్యం నిండిందని పలువురు మేధావులు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని 269 పోలింగ్ స్టేషన్లలోని ప్రతీ పోలింగ్ స్టేషన్లో దాదాపు మహిళలే ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకోగా బీఆర్ఎస్ గెలుపుకు నాందిగా కనిపిస్తున్నది. అయితే పూర్తి పోలింగ్ ముగిసే సరికి 79.54 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

**మండలాల వారీగా వివరాలు..**

నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 2,26,880 మంది ఓటర్లుండగా 1,80,451 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా 79.54 శాతం పోలింగ్ నమోదైంది.

- బుగ్గారం మండలంలోని 17,800 మంది ఓటర్లున్నారు. ఇందు13,651 ఓట్లు పోలయ్యాయి. 6029 మంది పురుషులు, 7622 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 76.59 శాతం పోలింగ్ నమోదైంది.

- **ప్రతీ పోలింగ్ స్టేషన్లో మహిళ ఓటింగ్ శాతమే అధికం**
- **సీఎం కేసీఆర్ పథకాల్లో మహిళ ప్రాధాన్యమే కారణం**
- **ఓటు హక్కువినియోగంలో పెరిగిన మహిళల భాగస్వామ్యం**

- ధర్మపురి మండలంలో 47,130 మంది ఓటర్లున్నారు. 35,814 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 16,070 మంది పురుషులు, 19,744 మంది మహిళలుండగా 75.99 శాతం పోలింగ్ నమోదైంది.
- ధర్మారం మండలంలో 44,396 మంది ఓటర్లుండగా 36,252 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వినియోగించుకున్న వారిలో 17845 మంది పురుషులు, 18405 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 81.66 శాతం పోలింగ్ నమోదైంది.
- ఎండపెల్లి మండలంలో 23,251 మంది ఓటర్లున్నారు. 18,950 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వినియోగించుకున్న వారిలో 9146 మంది పురుషులు, 9804 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 81.50 శాతం పోలింగ్ నమోదైంది.
- గొల్లపెల్లి మండలంలో 38,348 మంది ఓటర్లున్నారు. 30,814 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 13,820 మంది పురుషులు, 16,994 మం ది మహిళలుండగా 80.35శాతం పోలింగ్ నమోదైంది.
- పెగడపల్లి మండలంలో 35,056 మంది ఓటర్లున్నారు. 27,692 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 12,891 మంది పురుషులు, 14,801 మం ది మహిళలుండగా 78.99 శాతం పోలింగ్ నమోదైంది.
- వెల్గటూర్ మండలంలో 20,899 మంది ఓటర్లుండగా 17,278 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో 8,310 మంది పురుషులు, 8,968 మంది మహిళలున్నారు. ఈ మండలంలో 82.67శాతం పోలింగ్ నమోదైంది. ఇలా ప్రతీ మండలంలో మహిళా ఓటర్లు ఎక్కువగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

# అంగన్‌వాడీతో చదువుకు బాట



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాలు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్

- **కేంద్రాల్లో పెరుగుతున్న చిన్నారులు**
- **ఆటపాటలతో విద్యకు సన్నద్ధం**

చిగురుమామిడి, డిసెంబర్ 1: ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీవో, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు చేపట్టిన అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నది. ఇందులో భాగంగా ఇంటింటా తిరిగి కేంద్రాల్లో అందిస్తున్న సేవలు వివరించడంతో గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై క్రమంగా ఆసక్తి పెరిగింది. ఆటపాటలతో విద్యనందిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాల్లో చేర్పిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను టీచర్లు ఆటపాటలతో అలరిస్తూ వారికి అమ్మ ఒడిలో ఉన్న భావన కల్పిస్తున్నారు. ఉచిత విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఉదయం 9 గంటలకు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుంటుండగా, వారికి టీచర్లు స్వాగతం పలుకుతున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పరిశీలిస్తారు. వరుస క్రమంలో గదిబయట చెప్పులు పెట్టించడం ద్వారా క్రమశిక్షణ నేర్పుతున్నారు. అరగంట పాటు కేంద్రం ఆవరణలో ఆటలు ఆడిస్తారు. వ్యాయామం చేయిస్తున్నారు. ఉదయం 10 గంటలకు గుడ్డు అందిస్తారు. మాట్లాడే విధానాన్ని నేర్పిస్తూ భాషపై అవగాహన కల్పిస్తున్నారు.

**స్థాయిని బట్టి బోధన**

రెండున్నర నుంచి మూడేళ్ల వయస్సు వారిని నర్సరీ, మూడు, నాలుగు ఏళ్ల వయసున్న వారిని యూకేజీగా విభజిస్తారు. స్థాయిని బట్టి అక్షరాలు, అంకెలు బోధిస్తారు. నాలుగు సంవత్సరాలు పైబడిన వారికి సృజనాత్మక కృత్యాలను చూపిస్తూ నేర్పిస్తారు. చిన్నారులను వారితోనే చెప్పించే చిట్టి కథలు చెప్తారు. వాటి సారాంశాన్ని వారితోనే చెప్పించే ప్రయత్నం చేస్తారు. మధ్యాహ్నం భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకునే విధానం, ఎవరికి వారే అన్నం తినేలా దగ్గర ఉండి నేర్పిస్తారు. చిన్నారులను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండున్నర గంటల వరకు నిద్రపుచ్చుతారు. తర్వాత పునశ్చరణ తరగతులతోపాటు ఉపాధ్యాయులు వారితో ఆడుతూ ఆడిస్తారు.

**2053 మంది చిన్నారులకు ప్రయోజనం**

మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 39 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జీరో నుంచి ఏడు సంవత్సరాలు గలవారు మొత్తం 2053 మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతోపాటు విద్యకు సన్నద్ధం చేస్తారు. సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మండలంలోని 215 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేసి ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్నారు.

**పిల్లల సంఖ్య పెరుగుతున్నది**



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకర్షణీయంగా అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. చిన్నారులకు అక్షరమాలను బోధించడంతో పాటు బొమ్మలు వేయడంలో శిక్షణ ఇస్తున్నాం. ఆటపాటలతో వారిని తీర్చిదిద్దుతున్నాం. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

*-ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ (చిగురుమామిడి)*

## ఆర్థిక సహాయం అందజేత



కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న అధ్యక్షుడు ఎంఏ సలీం

మారుతీనగర్, డిసెంబర్ 1: పట్టణంలోని వెల్డింగ్ అండ్ ఇంజినీరింగ్ ఓనర్ అసోసియేషన్ సంఘ సభ్యుడు యామ సుధాకర్ మృతి చెందగా అతడి కుటుంబానికి అధ్యక్షుడు ఎంఏ సలీం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థికసహాయం అందజేశారు. సంఘ సమావేశంలో ఆయన కుటుంబ సభ్యులకు రూ.75 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇక్కడ సంఘ సభ్యులు వెంకటస్వామి, శ్రీనివాస్, మురళి, చిన్న సలీం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## అవగాహనతోనే వ్యాధుల నివారణ



కరపత్రాన్ని ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

మారుతీనగర్, డిసెంబర్ 1: అవగాహనతో వ్యాధులను నివారించవచ్చని సైకలాజిస్ట్ డాక్టర్ రాజరత్నాకర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఎయిడ్స్ అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గట్టయ్య, దశరథం, మధు, గణేశ్, శ్రీనివాస్, నాగేశ్వరాచారి, అమీనా, ఫాతిమా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

మేడిపల్లి, డిసెంబర్ 1: భీమారం మండలం గోవిందారంలో గొర్రెలు, మేకల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 20 మూగ జీవాలు మృతిచెందాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూపతి కొండ మల్లయ్యకు చెందిన గొర్రెలు, మేకల కొట్టంలోకి శుక్రవారం ఉదయం 3 గంటలకు కుక్కలు ప్రవేశించి దాడి చేశాయి. ఈ దాడిలో గొర్రెలు, మేకలు మొత్తం 20 మృతి చెందాయి. యజమాని భూపతి కొండ మల్లయ్య ఉదయం కొట్టం వద్దకు వెళ్లాడు. మృతిచెందిన గొర్రెలు, మేకలను చూసి లబోదిబోమన్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కరండ్ల మధుకర్, వెటర్నరీ డాక్టర్ వెన్నెల, రెవెన్యూ అధికారులకు సమాచారం తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. మృతి చెందిన గొర్రెలు, మేకల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు మల్లయ్య తెలిపాడు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్లాపూర్, డిసెంబర్ 01: మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మొగిలిపేట గ్రామానికి చెందిన అలిశెట్టి చంద్ర ప్రకాశ్ (32) అనే వ్యక్తి మృతిచెందాడు. చంద్ర ప్రకాశ్ మెట్‌పల్లి నుంచి మొగిలిపేట్ వైపు బైక్‌పై వస్తుండగా మల్లాపూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న కారు ముత్యంపేట గ్రామశివారులోని మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో చంద్రప్రకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో మెట్‌పల్లిలోని దవాఖానకు తీసుకెళ్లగా అక్కడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు.

## సమస్యను పరిష్కరించుకోవడానికే..

జగిత్యాల, డిసెంబర్ 1: తన పెద్ద కొడుకు ద్వారా తనకు జరిగిన అన్యాయం, సమస్యల పరిష్కారానికే జగిత్యాల అసెంబ్లీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశానని, ఎవరికీ నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని చీటి శ్యామల అన్నారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ సమీపంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తన సమస్యను లోకానికి చాటడానికే నామినేషన్ వేశానని, మీడియా సహకారంతో దేశ విదేశాల నుంచి మద్దతు దొరికిందని శ్యామల చెప్పారు. తాను కేవలం నామినేషన్ వరకే పరిమితమయ్యానని, ఎటువంటి ప్రచారాలకు పోలేదని, పోటీలో ఉన్న ఎవరికీ నష్టం కలిగించడం తమ ఉద్దేశం కాదని చెప్పారు.

## యాసంగి సాగుకు రైతన్న సమాయత్తం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 1: మండలంలోని చెంజర్ల, గంగిపల్లి, కొండపల్కల, గట్టుదుద్దెనపల్లి, ముంజంపల్లి గ్రామాల్లో యాసంగి వరి కోసం అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు. పల్లెల్లో దుక్కి దున్ని, నారుమడుల్లో సైతం నారు పోసుకున్నారు. నారును పెంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సారి వరి సాగులో వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో నారు వేసేందుకు ముందస్తు ప్రణాళికలతో సమాయత్తం అవుతున్నారు.